ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.
- క్రీడాకారులకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలియజేశారు.
- మహిళలు, చిన్నారుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు.
- మహిళా రక్షక్ వాహన సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

==================

రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయవాడలో ఈ నెల 29 నుండి 3 రోజుల పాటు జరిగే ఏం ఎస్ ఎం ఈ ఎక్సపో కి సంబంధించిన గోడ పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలు నెలకొల్పే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలను యువత సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని మంత్రి కోరారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పరిశ్రమలు ఏర్పాటు విషయంలో ఒక పాలసీని అమలు చేయడంతో పాటు కార్యాచరణను కూడా రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు.

==================

రాష్ట్రంలో ఇండోర్ స్టేడియాలు నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జూనియర్స్ బ్యాట్మింటన్ ఛాంపియన్షిప్-2024 ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ, అమరావతిలో అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

==================

మహిళలు, చిన్నారుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. అనంతపురంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజలకు బాధ్యతాయుతంగా ఉండేలా పోలీసు వ్యవస్థలో చర్యలు చేపట్టామన్నారు. దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణే పోలీసు వ్యవస్థ విధానమని, రాజ్యాంగానికి కట్టుబడి వ్యవస్థ పని చేస్తోందని అన్నారు. న్యాయం అందించేందుకే చట్టాలు, కోర్టులు ఉన్నాయని డీజీపీ మాట్లాడుతూ...

డీజీపి వాయిస్ బైట్.. (37 సెకన్లు)

==================

మహిళలు, విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈరోజు ఆయన మహిళా రక్షక్ వాహన సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా రక్షక్ వాహనాలు అన్ని పోలీస్ స్టేషన్లలో ఉంటాయని, ఈ వాహనాలతో మహిళ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ ప్రతి రోజు పాఠశాలలు ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు మహిళలు ఇంటికి వెళ్లే సమయంలో రక్షణగా ఉంటారని తెలిపారు. మహిళలు, విద్యార్థినిలు ఏ విధమైన సహాయనికైనా 112, 100 నంబర్లకు గాని, జిల్లా ఎస్పీ వాట్సాప్ హెల్ప్ లైన్ నంబర్ 9494933233కు ఫోన్ చేసి మహిళా రక్షక్ సేవలు పొందవచ్చన్నారు. ఈ మహిళా రక్షక్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని ఎస్పీ తెలిపారు.

==================

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఈరోజు కాకినాడలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి కల్పనకు మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మందగించిందని, మళ్ళీ పురోగతి సాధించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల్లో ప్రారంభిస్తామని జిల్లా అగ్రి ట్రేడ్&మార్కెటింగ్ అధికారి ఐ. ఐ. గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పత్తి రైతులు ఈ మార్కెట్ యార్డుకు వచ్చి పత్తిని విక్రయించుకోవాలని కోరారు. దళారుల మాటలు విని మోసపోవద్దని ఆయన సూచించారు.

===================

విరామం

===================

వైయస్సార్ జిల్లా వేంపల్లి లో పాపాఘ్ని నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక రైతులు జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎస్ సవితను కోరారు. ఈరోజు జిల్లా సమీక్ష సమావేశం నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరిన మంత్రి సవితను మార్గం మధ్యలో రైతులు అడ్డుకున్నారు. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి వైయస్సార్ జిల్లా ప్రతినిధి శ్రీనాథ రెడ్డి అందిస్తారు.

వాయిస్ బైట్.. శ్రీనాథ రెడ్డి .. (32 సెకన్లు)

===================

రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. అనంతపురంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో ఈరోజు నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ, మౌలిక సదుపాయాలను కల్పించి పోలీసు వ్యవస్థను సాంకేతికంగా బలోపేతం చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తామని హోం మంత్రి తెలిపారు.

===================

ఆగ్నేయ బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దక్షిణ మధ్య బంగాళా ఖాతము సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో విస్తరించి ఉంది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో ఉత్తర, దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమలలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. రానున్న రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2నుండి 4 డిగ్రీలు అధికంగా నమోదు అయ్యే అవకాశము వుందని వాతావరణ శాఖ తెలిపింది.

===================

గ్రామ శివారు ప్రాంతాల్లో సైతం మంచినీటిని అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు అన్నారు. జల జీవన్ మిషన్ లో భాగంగా భీమవరం మండలం వెంప గ్రామంలో సుమారు 37 లక్షల 95 వేల రూపాయలతో మైక్రో ఫిల్టర్ ను ప్రారంభించి మరో 72 లక్షల రూపాయల పైపు లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

===================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సర్వదర్శనానికి 13 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారని తిరుమల తిరుమల దేవస్థానం (టిటిడి) అధికారులు వెల్లడించారు. నిన్న తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని 74,651 మంది భక్తులు దర్శించుకున్నారని, స్వామి వారి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు వచ్చిందని అధికారులు తెలియజేశారు.

===================

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ )లో అత్యున్నత ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయిలో మొదటి, రెండవ ర్యాంకులను సాధించిన విద్యార్థినులను విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. టెట్ పరీక్షలో జిల్లాకు చెందిన కోండ్రు అశ్విని 150కి 150 మార్కులను, దాసరి ధనలక్ష్మి 149.99 మార్కులను సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే 149.56 మార్కులను సాధించిన దేవ హారిక మరికొందరితో ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచారు. ఇదే పట్టుదలతో చదివి ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని, మరింత ఉన్నత స్థానాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లాలో టిడ్కో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని టిడ్కో ప్రాజెక్ట్ అధికారి డి.వి.రమణ మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో జిల్లాలో

ఫేజ్-2 కింద 2,944 గృహాలు మంజురుకాగా 2,544 గృహ నిర్మాణ పనులను 2018లోనే ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుత నిర్మాణంలో ఉన్న గృహాలకు 85% మౌలిక సదుపాయాల పనులు జరిగాయని, మురుగు నీటి సరఫరా, శుద్ధి కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

===================

===================